భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు


కదిరిలో ఈద్గా మైదానంలో సామూహిక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


నల్లచెరువు: ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

కదిరి: కదిరితో పాటు పరిసర మండలాల్లో ముస్లిం మైనారిటీలు గురువారం పవిత్ర రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని అక్బరియా మసీదు ఈద్గా మైదానం ముస్లింలతో కిటకిటలాడింది. 10 ఎకరాలకు పైగా వున్న ఆ ప్రాంగణం ప్రార్థనలకు సరిపోలేదు. దీంతో ఎప్పటిలాగానే కదిరి–బెంగళూరు రహదారిపై కూడా కొందరు ప్రత్యేక సామూహిక ప్రార్థనలు చేశారు. ముస్లిం మత పెద్దలు అందరి చేత ప్రార్థనలు చేయించిన తర్వాత తమ సందేశాన్ని విన్పించారు. వైఎస్సార్‌సీపీ కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి బి.ఎస్. మక్బూల్ అహ్మద్ ఉదయాన్నే తోటి ముస్లింతో కలిసి ఈద్గా మైదానం చేరుకొని సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ప్రార్థనల అనంతరం అందరూ కుల, మతాలకతీతంగా 'ఈద్ ముబారక్' అంటూ ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లింలు తోటి మిత్రులు, బంధువులను తమ ఇళ్లకు ఆహ్వానించి విందు భోజనాలతో రోజంతా ఆనందంగా గడిపారు. సామూహిక ప్రార్థనలు ముగిసేవరకూ పోలీసులు పట్టణంలో ట్రాఫిక్‌పై ఆంక్షలు విధించారు. ఆ దారిగుండా వాహనాలు వెళ్లకుండా దారి మళ్లించారు. ప్రార్థనల్లో మాజీ మంత్రి షాకీర్, మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా, మైనార్టీ నాయకులు ఎస్ఎండీ ఇస్మాయిల్, సాదత్‌తో పాటు అన్ని రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్: మండలవ్యాప్తంగా గురువారం రంజాన్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెడపల్లి, నిడిమామిడి, వెంగళమ్మచెరువు, చెర్లోపల్లి, బత్తలపల్లి, జగరాజుపల్లి, మామిళ్లకుంట క్రాస్ తదితర గ్రామాల్లో ఈద్గాలకు ర్యాలీగా వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈద్గా వద్ద ప్రత్యేక షామియానాలతోపాటు నీటి సౌకర్యం కల్పించారు.


ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న కోటి సూర్యప్రకాష్‌బాబు

పుట్టపర్తి రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ప్రార్థనలు ముగిసి ఇంటికి వచ్చే సమయంలో అనాథలకు కానుకలు అందజేశారు.

నల్లమాడ: మండల వ్యాప్తంగా గ్రామాల్లో ముస్లింలు గురువారం రంజాన్ వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నల్లమాడలో ముస్లింలు ర్యాలీగా వైఎస్సార్ కూడలిలోని ఈద్గా వద్దకు చేరుకొని సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. పేదలకు దానధర్మాలు చేశారు.

ఓడీచెరువు: పవిత్ర రంజాన్ పవిత్ర దినాన్ని మండలంలోని ముస్లింలు సంతోషంగా జరుపుకున్నారు. ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

తాడిమర్రి: తాడిమర్రి, పిన్నదరి, నార్సింపల్లి, ఎం.అగ్రహారం, శివంపల్లి, చిల్లకొండయ్యపల్లి, నాయనపల్లి, పత్రపల్లి తదితర గ్రామాల్లో ముస్లింలు రంజాన్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక జామియా మసీదులో పెద్దసంఖ్యలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వారు ర్యాలీగా ఈద్గా వద్దకు వెళ్లారు. ఈ సందర్భంగా మత పెద్ద ఖురాన్ చదివి వినింపించారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం వారు ఒకరికి ఒకరు ఈద్ ముబారక్ అంటూ ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

నల్లచెరువు: మండల వ్యాప్తంగా గురువారం రంజాన్ వేడుకలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండల కేంద్రంలోని ఈద్గా మైదానంలో నూతన వస్త్రాలు ధరించి ముస్లింలు, మత పెద్దలతో కలిసి సామూహిక ప్రార్థనలు చేశారు. ప్రభుత్వ ఖాజీ అమీర్‌ఖాన్ రంజా సందేశాన్ని వినిపించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బట్టీ హైదర్‌వలి మండల ప్రజలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

ఎన్‌పీకుంట: ప్రేమ, దయ సమ్మిళితమే అల్లాహ్ తత్వమని మండల ఖాజీ బాబ్జాన్ పేర్కొన్నారు. గురువారం మండలకేంద్రంతో పాటు మండల పరిధిలోని పెడబల్లి, ధనియానిచెరువు, మరికొమ్మదిన్నె, జౌకల, వెలిచలమల గ్రామాల్లోని ఈద్గాల వద్దకు ఉదయమే చేరుకున్న ముస్లింలు ఈద్–ఉల్–ఫితర్ నమాజును ఆచరించారు. నమాజు అనంతరం జరిగిన ధార్మిక ఉపన్యాసంలో మత గురువులు అల్లాహ్ తత్వాన్ని వివరించారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకోని ఈద్‌ముబారక్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈద్గా నుంచి వెలుపలకు వచ్చిన ముస్లింలు పేదలకు దానధర్మాలు చేశారు.

బత్తలపల్లి: మండలవ్యాప్తంగా గురువారం రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన ముస్లింలు బత్తలపల్లిలోని మదీనా, జామీయా, నూర్జానీ మసీదుల్లో నమాజ్ చేసుకుని ఈద్గా మైదానంకు ర్యాలీగా చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మౌలానా ఖురాన్ బోధనలను వినిపించారు. మతపెద్దలు కరీంసాబ్, సులేమాన్, మాబాషా, కాశింసాబ్, సత్తార్, జిలాని, జిక్రియా, టైలర్ బాబా, పోస్టు బాబు, షాషా, మక్బుల్, బాబ్‌జాన్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు శుభాకాంక్షలు..

ప్రార్థనలు అనంతరం ముస్లిం సోదరులకు ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబుతో పాటు బత్తలపల్లి–1 ఎంపీటీసీ సభ్యులు కోటి నరేష్‌కుమార్, వైఎస్సార్‌సీపీ యువజన నాయకులు కోటి సురేష్‌కుమార్ ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు కరీంసాబ్, సత్తార్, జిలాన్, బాబ్‌జాన్, అబ్దుల్ రజాక్, టైలర్ బాబా, మౌలా, కాశీంవలి, జిక్రీయా, దాదాపీర్, చికెన్ దాదా, అలీమౌలా, హసన్ వలీ, షేక్షావలి, షాషూ, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి: బుక్కపట్నం మండలంలో గురువారం రంజాన్ వేడుకలు ఘనంగా జరిగాయి. ముస్లింలు ఊరేగింపుగా ఈద్గాలకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మతపెద్దలు రంజాన్ ప్రాముఖ్యతను వివరించారు.

తనకల్లు: మండల కేంద్రంతో పాటు దుగినేపల్లి, కొక్కంటిక్రాస్, బొంతలపల్లి, కొక్కంటి, కుంటమరవ, కోటూరు, పరాకువాండ్లపల్లి, సీఆర్ పల్లి, ఉస్తినిపల్లి , కొర్తికోట తదితర గ్రామాలలో గురువారం రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ఈద్గాల వద్ద ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు ఖురాన్ సారాంశాన్ని విరించారు. అనంతరం ఒకరికొకరు ఈద్ శుభాకాంక్షలను తెలియజేసుకున్నారు.

ముదిగుబ్బ: మండల కేంద్రంలో గురువారం రంజాన్ వేడుకలను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. బస్టాండ్ వద్ద ఈద్గా, పాతూరులోని ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మతపెద్దలు ఖురాన్ సారంశాన్ని వివరించారు.


ప్రార్థనల అనంతరం మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా, మైనార్టీ సోదరులతో వైఎస్సార్‌సీపీ కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి మక్బూల్


పుట్టపర్తి మండలం నిడిమామిడి వద్ద ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు


తాడిమర్రిలో ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు


ఎన్.పీ.కుంట ఈద్గామైదానం లో సందేశం వినిపిస్తున్న మండల ఖాజీ బాబ్జాన్


బత్తలపల్లి ప్రార్థనలు చేసేందుకు వెళుతున్న ముస్లింలు


ముదిగుబ్బలో ప్రార్థనలకు వెళుతున్న ముస్లింలు


తనకల్లులోని ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి


ధర్మవరంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఘనంగా రంజాన్ వేడుకలు

ధర్మవరం: పట్టణంలో గురువారం ఘనంగా రంజాన్ వేడుకలను నిర్వహించారు. పట్టణంలోని కేతిరెడ్డి కాలనీ సమీపంలోనున్న ఈద్గా మైదానంలో రంజాన్‌ను పురస్కరించుకుని ముస్లిం పెద్దలు, సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈద్గా వద్దకు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి హాజరై ప్రార్థనలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే కేతిరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా సుఖసంతోషాలతో ఉండాలని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే ముస్లింలను ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలియజేశారు.

క్లుప్తంగా

కదిరి అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా 'పూల'


సీఎంకు పుష్పగుచ్ఛం అందిస్తున్న పూల శ్రీనివాసరెడ్డి

కదిరి: వైఎస్సార్‌సీపీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కదిరి అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా పూల శ్రీనివాసరెడ్డిని నియమించారు. ఈ మేరకు గురువారం ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. ఈయన ఇన్నాళ్లూ పార్టీ సీఈసీ సభ్యుడిగా ఉన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి కదిరి నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధి కోసం కష్టపడి పని చేస్తున్నారు. 2014లో అత్తార్ చాంద్‌బాషా, 2019లో డాక్టర్ పీవీ సిద్దారెడ్డిలను ఎమ్మెల్యేగా గెలిపించుకోవడంలో ఈయన కీలకంగా పని చేశారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ కదిరి ఎమ్మెల్యే అభ్యర్థిగా బి.ఎస్.మక్బూల్ అహ్మద్‌ను పార్టీ అధినేత వైఎస్ జగన్ ప్రకటించిన విషయం తెలిసిందే. అందుకే పార్టీ అధినేత వైఎస్ జగన్ ఈయనను కదిరి అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా నియమించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనపై ఎంతో నమ్మకంతో తనకు కీలక బాధ్యతలు అప్పగించారని, ఇందుకు సీఎంకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నానని ఈ సందర్భంగా ఆయన 'సాక్షి'తో అన్నారు.ఈ ఎన్నికల్లో మక్బూల్ అహ్మద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకొని సీఎంకు కానుకగా ఇస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

నేడు ఎమ్మెల్యే కేతిరెడ్డి ఇంటింటా ప్రచారం

బత్తలపల్లి: కట్టకిందపల్లి, సూర్యచంద్రాపురం గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం 4 గంటలకు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఇంటింటా ప్రచారం నిర్వహించనున్నట్లు ఎంపీపీ బగ్గిరి త్రివేణి, వైస్ ఎంపీపీ గజ్జెల వెంగళరెడ్డి, సర్పంచు చల్లా కరుణాకర్‌నాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి తెలిపారు. ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

నేడు నల్లమాడలో 'దుద్దుకుంట' ప్రచారం

నల్లమాడ: మండల కేంద్రంలో శుక్రవారం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఉదయం 7–30 గంటలకు వైఎస్సార్ కూడలి నుంచి ప్రచారం ప్రారంభమవుతుందని, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరాయి.

శ్రీరామనవమి ఉత్సవాలకు విరాళం

ఎన్‌పీకుంట: ఆసంవారిపల్లి వద్ద గల ఆనంద ఆశ్రమంలో శ్రీరామనవమి ఉత్సవాల నిర్వహణకు పెడబల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత యువపారిశ్రామికవేత్త ఎం.హరీష్‌రెడ్డి విరాళం అందించారు. గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండగా ఆశ్రమం నిర్వాహకులు ఆనంద ఆశ్రమంలో శ్రీరామనవమి ఉత్సవాలు ఏటా వైభవంగా నిర్వహిస్తారని, వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తామని తెలియజేశారు. స్పందించిన ఎం.హరీష్‌రెడ్డి తన వంతు సాయంగా నగదు అందించారు. వైస్ ఎంపీపీ కేశవరెడ్డి, నాయకులు పుల్లారెడ్డి, మహేశ్వరరెడ్డి, ఉమాశంకర్‌రెడ్డి, మాధవరెడ్డి, ఆంజనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


జగనన్నతోనే సంక్షేమ రాజ్యం


వేములేటిపల్లిలో ప్రచారం చేస్తున్న నాయకులు

కొత్తచెరువు: జగనన్నతోనే సంక్షేమ రాజ్యం సాధ్యమని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. గురువారం వేములేటిపల్లిలో దుద్దకుంట శ్రీధర్‌రెడ్డి బావమరిది రాఘవరెడ్డి నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. సీఎం జగన్ ఆశీస్సులతో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశారన్నారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బోయ శాంతమ్మ, దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నారేపల్లి జగన్‌మోహన్‌రెడ్డి, మండల పరిశీలకుడు ఆవుటాల రమణారెడ్డి, సర్పంచ్ భర్త నరసింహారెడ్డి, కొడపగానిపల్లి రఘునాథరెడ్డి, దాల్‌మిల్‌సూరి, చౌరెడ్డి, అంగడిసత్తి. ఓడీసీ శ్రీనివాసులు రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, పాటిల్ సాంబశివారెడ్డి, ఎంపిటీసీ భర్త శ్రీనివాసులు, డీలర్ మల్లికార్జున, బాలకుళ్లాయప్ప, నాగరాజు, రామాంజి, కిష్ట, గోపాల్, సురేందర్‌రెడ్డి, వినోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే బావమరిది రాఘవరెడ్డి కోరారు. గురువారం ఆయన వెంకటగారిపల్లిలో స్థానిక నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

జగనన్నను మరోసారి సీఎం చేసుకుందాం


ప్రచారం నిర్వహిస్తున్న మక్బూల్ అహ్మద్, నేతలు

తలుపుల: దేశంలోనే ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా సంక్షేమ పథకాలు అమలు చేసిన సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎం చేసుకుందామని వైఎస్సార్‌సీపీ కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి బి.ఎస్ మక్బూల్ అహ్మద్ ఓటర్లను అభ్యర్థించారు. పులిగుండ్లపల్లి పంచాయతీలోని రాజనాలవాండ్లపల్లి, ఎనమదొడ్డివారిపల్లి, ఎస్సీ కాలనీ, జ్యోతివాండ్లపల్లి, జ్యోతివాండ్లపల్లి తండా, అగ్రహారంపల్లిలో సర్పంచ్ సుగుణమ్మ, మాజీ సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ లోకనాథరెడ్డి ఆధ్వర్యంలో గురువారం సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసులురెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తల హరిప్రసాద్ సింగిల్ విండో మాజీ అధ్యక్షులు గిరిధర్‌రెడ్డిలతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఏ గడపకు వెళ్లినా తమకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని ప్రజలు అన్నారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి తనతోపాటు ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మను గెలిపించాలని మక్బూల్ అహ్మద్ ప్రజలను కోరారు. మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కులశేఖర్‌రెడ్డి, సేవాదళ్ జోనల్ ఇన్‌చార్జ్ డీకేబాబు, సర్పంచ్‌లుషెక్షావలి, దివాన్‌వలి, మల్లినాయుడు, మాజీ జెడ్పీటీసీ సురేంద్రారెడ్డి, కుర్లి శివారెడ్డి, మాజీ సర్పంచ్ సూర్యనారాయణరెడ్డి, చంద్రానాయక్, నాయకులు వివేకానందరెడ్డి, బొట్టువెంకటరమణ, సుబ్బారెడ్డి, చంద్రారెడ్డి, అశోక్, హరి, సుబ్బయ్య పాల్గొన్నారు.

ముమ్మరంగా ఎన్నికల ప్రచారం

ఓడీచెరువు: మండలంలోని పలు పంచాయితీల్లో వడ్డెర్లు, ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో గురువారం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, బోయ శాంతమ్మ తరపున ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వడ్డెర్ల కమిటీ తరపున రిటైర్డ్ డీఎస్పీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో దిగువపల్లి, కుసుమవారిపల్లి, చింతమానిపల్లి పంచాయితీల్లో ఇంటింటికి తిరుగుతూ ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్దించారు. ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో కొండకమర్ల, నవాబుకోట, చెరువు మునెప్పపల్లి, ఎద్దులవారిపల్లి ఎస్సీ కాలనీలలో ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఓడీచెరువు మండల ఎస్సీసెల్ మండల కన్వీనర్ రామాంజి, జిల్లా కార్యదర్శి అంజినప్ప, కొండకమర్ల సర్పంచు తంద్రి రమణ, ఇనగలూరు సచివాలయ కన్వీనర్ లక్ష్మినారాయణ, నాయకులు వెంకటరమణ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు

మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి

కదిరి టౌన్: పట్టణంలో గురువారం మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బీసీ ఎంప్లాయిస్ స్టేట్ జనరల్ సెక్రటరీ చింతా నాగరాజు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పూలే ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని, బడుగు బలహీన వర్గాలు ఐక్యంగా హక్కుల కోసం పోరాడాలన్నారు. ఎస్సీ ఉద్యోగుల సంఘం నాయకులు ఆనంద్, నాగేంద్ర, ఎస్టీ ఉద్యోగుల సంఘం నాయకులు సుబ్బయ్యనాయక్, రవీంద్రనాయక్, బీసీ ఉద్యోగులు నారాయణ, శ్రీనివాసులు, రామాంజనేయులు, ఆదిబయన్న, మునిస్వామి, శంకర్, సుధాకర్, లాయర్ రామస్వామిపాల్గొన్నారు.

ధర్మవరం అర్బన్: బడుగు బలహీనవర్గాలకు అండగా నిలిచిన పోరాటయోధుడు జ్యోతిరావ్‌పూలే అలాంటి నాయకుని అడుగుజాడల్లో ప్రతిఒక్కరూ నడవాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. మహాత్మా జ్యోతిరావ్ పూలే 197వ జయంతి సందర్భంగా స్థానిక కాలేజి సర్కిల్‌లోని జ్యోతిరావ్‌పూలే విగ్రహానికి గురువారం యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి, యూటీఎఫ్ నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

• **బీసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో**

బీసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జ్యోతిరావ్ పూలే విగ్రహానికి పూలమాలలు వేశారు. బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు ఎల్‌పీ సర్కిల్‌లోనున్న జ్యోతిరావ్‌పూలే విగ్రహానికి నివాళులర్పించారు. కాలేజిసర్కిల్ వద్ద జ్యోతిరావ్‌పూలే విగ్రహానికి నాయిబ్రాహ్మణులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. లింగమూర్తి, లింగమయ్య, శ్రీరాములు, రమణ, ఆంజనేయులు, తిరుపతయ్య, మహేష్, శ్రీనివాసులు, సాయిప్రసాద్ పాల్గొన్నారు.

విశ్వసనీయతకు పట్టం కడదాం

పుట్టపర్తి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశ్వసనీయతకు మారుపేరని, ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి పట్టం కడదామని ఆ పార్టీ సీనియర్‌నేత దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి ఓటర్లను కోరారు. బుక్కపట్నం మండలం అగ్రహారంలో గురువారం ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి శ్రీధర్‌రెడ్డిని గెలిపించాలని తద్వారా రెండో సారీ జగన్‌ను సీఎంగా చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్ నాగేంద్రమ్మ, మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, మండల గ్రామ సచివాలయాల కన్వీనర్ గోవర్దన్‌రెడ్డి, నికనాయకులు నరసింహులు, శివయ్య, మల్లేష్, లింగమయ్య, గోపీ స్వామి తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకే ఓటేద్దాం


వైఎస్సార్‌సీపీకే ఓటేయాలని ప్రచారం చేస్తున్న దుద్దుకుంట కిషన్‌రెడ్డి

అమడగూరు: వచ్చే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటేసి మరోసారి వైఎస్సార్‌సీపీనే గెలిపించుకుందామని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తనయుడు దుద్దుకుంట కిషన్‌రెడ్డి ఓటర్లను కోరారు. గురువారం కందుకూరిపల్లి, తనకంటిపల్లి, హరిపురం గ్రామాల్లో జోరుగా ప్రచారం చేశారు. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ కుల, మత, వర్గ, పార్టీ, విభేదాలకు అతీతంగా జగనన్న పాలన అందించారన్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలో ఎన్నో అభివద్ది పనులను చేసిన ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని మరువకూడదని, ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించడానికి మనమంతా పెద్దెత్తున కృషి చేయాలన్నారు. పుట్టపర్తిని జిల్లా కేంద్రం చేయడంలో ఎమ్మెల్యే కషి మరువలేనిదన్నారు. భవిష్యత్తులో మంచి సంక్షేమ పథకాలు అమల్లో ఉండాలంటే పుట్టపర్తిలో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేద్దామని పిలుపునిచ్చారు. ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి, జెడ్పీటీసీ కవితాశివశంకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ జయప్ప, సొసైటీ ప్రెసిడెంట్ బొట్టుస్వామి, సర్పంచ్ న రసమ్మ, ఎంపీటీసీ జయమ్మ, నక్కలచిన్నప్ప, నాగరాజు, రంగరామప్ప, లక్ష్మి, రాజన్న, లక్ష్మీరెడ్డి, శ్రీనివాసరెడ్డి, చౌడప్ప, రమేష్, ఆచారి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించండి


కనుమ్ముకల సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

చెన్నేకొత్తపల్లి: ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండంలోని చిన్నపురెడ్డిపల్లి, కనుముక్కల, ఓబుళంపల్లి, ఆమిదాలకుంట, నాగిశెట్టిపల్లి, గంగినేపల్లి, గంగినేపల్లి తండా, ఎర్రోనిపల్లి, ఎర్రోనిపల్లి తండాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి పథకాలను వివరించారు. సంక్షేమ సారథి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి పట్టం కట్టాలని కోరారు. జగనన్న ఏదైనా చెప్తే అందులో నిజం ఉంటుందన్నారు. చంద్రబాబు ఏది చెప్పినా అబద్ధం మోసం ఉంటాయని తెలిపారు. సీఎం జగనన్న వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేశారన్నారు. దేశానికే ఆదర్శంగా పాలన సాగించారని కొనియాడారు. 2019 ఎన్నికల్లో తనను 25 వేల మెజార్టీతో గెలిపించిన ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ పాలనలో పేరూరు డ్యాంకు నీరందించామన్నారు. రైతుల పొలాల్లో ఉచితంగా బోర్లు వేశామని పేర్కొన్నారు.

3 వేల మందికి ఉపాధి కల్పిస్తాం..

రామగిరి మండలంలోని బంగారు గనులను తెరిపించేందుకు కృషి చేశామని తెలిపారు. ఇవి తిరిగి తెరిస్తే 3 వేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. జగనన్న పాలనలో అక్కచెల్లెమ్మలు, అవ్వతాతల ముఖాల్లో చిరునవ్వు చూశామన్నారు. ప్రభుత్వ బడులను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేసినట్లు వెల్లడించారు. విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, బూట్లు, టై, బ్యాగు తదితర వస్తువులు అందజేసినట్లు తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు ప్రవేశపెట్టి గ్రామాల్లో వైద్య సేవలు అందించామన్నారు. టీడీపీ మళ్లీ మోసం చేసేందుకు వస్తోందని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. 25 ఏళ్లు అధికారంలో ఉండి ప్రజలకు మంచి చేయని వారు ఇప్పుడు అమాయకులను అడ్డుపెట్టుకుని చిచ్చుపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఓడిపోయిన వెంటనే ప్రజలను విస్మరించిన పరిటాల కుటుంబం హైదరాబాద్ చేరిందన్నారు. గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి చెన్నేకొత్తపల్లి, రామగిరి, కనగానపల్లిలోని పలు గ్రామాలకు తాగునీటిని అందించే పనులు చేపట్టామన్నారు. రూ.20 కోట్లతో అమ్మ డైయిరీ ఏర్పాటు చేసి మహిళా రైతులకు అప్పగించామన్నారు. మరోమారు అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేస్తామన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను అత్యధిక మెజారీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. సానే రాజారెడ్డి, గంగుల భానుమతి, సానే నరసింహారెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రోగులకు అల్పాహారం పంపిణీ

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో గురువారం శ్రీ సత్యసాయి భజన మండలి సభ్యులు రోగులు, వారి సహాయకులకు అల్పాహారం అందించారు. ఆసుపత్రిలోని 150 మంది రోగులు, సహాయకులకు పాలు, బ్రెడ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు.